క్లుప్తంగా

10న జాబ్‌మేళా

నిడదవోలు: పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్‌పోర్టు, వరుణ్ మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. ఎంకాం, ఎంబీఏ, డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణులైన 19 నుంచి 35 ఏళ్ల లోపు యువత జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడం ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడెటాతో పాటు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఈనెల 10న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9988853335, 8712655686 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ జ్యోతి పేర్కొన్నారు.

ఆలయానికి వితరణ


వాటర్ ప్యూరీఫైర్ అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.15 వేలు విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను చుండ్రు సుబ్రహ్మణ్యం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ బోర్డు చైర్మన్ దాపర్తి వెంకటేశ్వరరావు, సమరసత సేవా ఫౌండేషన్ మండల శాఖ అధ్యక్షుడు వెల్లంకి రాఘవ, ఆలయ పూజారి గంజాం రవిశాస్త్రి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన


సమిశ్రగూడెంలో విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న మానవత సభ్యులు

నిడదవోలు రూరల్: విద్యార్థులంతా తమ జీవిత లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకోవాలని మానవత కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ కోడూరి రాధా పుష్పావతి సూచించారు. మానవత ఆధ్వర్యంలో మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, నిడదవోలు శాఖ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, తన్నీడి బోసు, హెచ్ఎం కె.జిలానీ, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉండ్రాజవరం: మండలంలో ఖాళీలు ఏర్పడ్డ రేషన్ డీలర్ల నియామకానికి బుధవారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండ్రాజవరం షాపు నెంబర్-04 (ఓసీ మహిళ), తాడిపర్రు షాపు నెంబర్-30 (ఎస్సీ), పాలంగి షాపు నెంబర్-45 (దివ్యాంగులు)కు డీలర్ల నియామకాలు చేపడతామన్నారు.

మాతంగమ్మ రైసుమిల్లు యజమానులపై కేసు

గోపాలపురం: కోమటికుంట గ్రామంలోని మాతంగమ్మ రైసుమిల్లు యజమానులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై సీఎస్ డీటీ కె.దివాకర్ మంగళవారం తెలిపారు. ఈ రైసుమిల్లులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టిన సంగతి పాఠకులకు తెలిసిందే. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకూ విజిలెన్స్ డీఎస్పీ కె.తాతారావు బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రైసుమిల్లులో అక్రమంగా 44 మూటల్లో నిల్వ ఉంచిన 2,123 క్వింటాళ్ల రేషన్ బియ్యం, జంగారెడ్డిగూడెం విష్ణుప్రియ రైసు మిల్లుకు చెందిన లారీలోని సుమారు 27 టన్నుల బియ్యాన్ని గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యానికి సంబంధించి 6 ఏ కేసు నమోదు చేసి, పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని వెంకటాయపాలెం రైసుమిల్లుకు తరలించారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

కొవ్వూరు: బాల్య వివాహాల నిర్మూలనను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో కె.సుశీల సూచించారు. మండల స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలన, పరిరక్షణ కమిటీ సభ్యులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఒక్కరోజు శిక్షణ అందించారు. బాల్య వివాహాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సీడీపీవో డి.మమ్మి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ తదితరులు మాట్లాడారు. పట్టణంలోని పది సచివాలయాల పరిధిలోని 23 వార్డులకు చెందిన మహిళా సంరక్షణ కార్యదర్శులు, హెల్త్ సెక్రటరీలు, మెప్మా ఆర్పీలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

పరిమళిస్తున్న మానవత్వం

- స్ఫూర్తిదాయక సేవలతో ముందడుగు
- శాంతి రథాల ద్వారా శ్మశాన వాటికలకు మృతదేహాల తరలింపు
- అనాథ మృతదేహాలకు ఉచితంగా అంత్యక్రియలు
- అభాగ్యులకు ఆర్థిక సాయం అందజేత
- ఆదర్శంగా నిలుస్తున్న మానవత సేవా సంస్థ


దేవరపల్లి మండలంలో దాతలు సమకూర్చిన శాంతి రథం


అనారోగ్యంతో బాధ పడుతున్న రోగికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

దేవరపల్లి: మన అనుకునే వారికి ఏదైనా జరగరానిది జరిగితే తల్లడిల్లిపోతాం. అలాంటిది వారు మృతి చెందితే ఆ బాధ వర్ణనాతీతం. వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశాన వాటికలు, కైలాస భూములు ఎక్కడో దూరాన ఉంటే అక్కడికి తీసుకువెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి నలుగురు కూడా దొరకని నేటి రోజుల్లో మేమున్నామంటూ ముందుకు వస్తోంది మానవత స్వచ్ఛంద సేవా సంస్థ. అంత్యక్రియల క్రతువును సైతం వ్యాపారంగా మార్చేసిన ప్రైవేటు వ్యవస్థకు దీటుగా నిస్వార్థ సేవా భావంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ దాతల సహకారంతో గ్రామాల్లో శాంతి(కైలాస) రథాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పాడెకట్టి నలుగురు అతి ప్రయాసతో తీసుకువెళ్లాల్సిన పరిస్థితిని మార్చేసింది. భగవద్గీత శ్లోకాలు, భక్తి భావం ఉట్టిపడే ఆకారంతో తయారు చేసిన శాంతి రథాలు అమూల్యమైన సేవలు అందిస్తున్నాయి.

2004లో ఆవిర్భావం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2004లో ఆవిర్భవించింది. అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం ఖండవల్లికి చెందిన మానవతా వాది ఎస్. రామచంద్రారెడ్డి ఈ సేవా సంస్థను స్థాపించారు. 108 మంది సభ్యులతో స్థాపించిన సంస్థ నేడు గ్రామ, గ్రామాన విస్తరిస్తూ 123 మండలాల్లో సేవలను విస్తరించింది. చిత్తూరు నుంచి ఇచ్ఛాపురం వరకు గల మండలాల పరిధిలో 70 వేల మంది సభ్యులు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అనేక మంది ప్రశంసలు అందుకుంటున్నారు. సుమారు 700 మార్చురీ ఫ్రీజర్లు, 100 శాంతి రథాలు, 10 అంబులెన్స్‌లు, 25 వాటర్ ట్యాంకులతో రాష్ట్రంలో స్ఫూర్తిదాయక సేవలను అందిస్తోంది మానవత సంస్థ.

సేవలు ఉచితం

మృత దేహాలను ఇంటి వద్ద నుంచి కైలాస భూమికి తీసుకువెళ్లడానికి శాంతి రథాన్ని ఉచితంగా సమకూర్చుతున్నారు. 10 కిలోమీటర్ల వరకు ఉచితం కాగా, ఆ పరిధి దాటితే ఇంధనం ఖర్చును వసూలు చేస్తారు. దేవరపల్లి మండలంలో 2004లో ప్రారంభించిన సంస్థ ప్రస్తుతం 400 మంది సభ్యులతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దాత తానింకి సత్యనారాయణ రూ.8 లక్షల వ్యయంతో శాంతి రథం అందజేయగా, రథాన్ని భద్రపరచడానికి స్థానిక కోస్టల్ బ్యాంకు రూ.2 లక్షలు విరాళం అందజేసింది. మరో రూ.2 లక్షలను సంస్థ సభ్యుల విరాళాలతో సమకూర్చారు. రూ. 4 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేశారు. ఏ మృత దేహానికైనా శాంతి రథం కావాల్సివస్తే మానవత సంస్థ వారిని సంప్రదిస్తే వెంటనే ఇంటికి వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. గ్రామాల్లో దాతల సహకారంతో ఫ్రీజర్లను ఏర్పాటు చేశారు.

బాధితులకు చేయూత

అనారోగ్యంతో బాధ పడుతున్న వారు, ప్రమాదాల బారిన పడి రోడ్డున పడిన కుటుంబాలకు సంస్థ ఆర్థిక సాయం చేస్తూ చేయూత నిస్తోంది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తోంది. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి రూ.5 వేల నుంచి 10వేలు ఆర్థిక సాయం చేస్తోంది. సాయం కావలసిన వారు సంస్థ ప్రతినిధులను సంప్రదించవచ్చు.

70 వేల మందితో సేవలు



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్ఫూర్తిదాయక సేవలను అందిస్తోంది. ఇది భావి తరాల వారికి ఆదర్శం కాగలదు. భవిష్యత్తులో దేశమంతటా విస్తరించి మానవాళికి ఒక శాంతి సందేశాన్ని అందజేయాలనే ఆశయంతో ఈ సంస్థను స్థాపించాను. ఉచితంగా మార్చురీ ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథాలు, అవకాశాన్ని బట్టి అంబులెన్సులు, వాటర్ ట్యాంకర్‌లతో సేవలు అందజేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది సభ్యులు ఒక సైన్యంలా పని చేస్తూ సేవలందిస్తున్నారు. సంస్థలో అనేక మంది మేధావులు మమేకమై నిరంతరం శ్రమిస్తున్నారు.

– ఎస్.రామచంద్రారెడ్డి, వ్యవస్థాపకులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ.

దాతల సహకారం ఎనలేనిది



మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయం. సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి దాతలు సహకరిస్తున్నారు. గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన దాత తానింకి సత్యనారాయణ(బాబి) మూడు శాంతి రథాలను దేవరపల్లి, గోపాలపురం, రాజమహేంద్రవరాలకు ఉచితంగా అందజేశారు. గోదావరి తీరంలో దహన సంస్కారాలకు రథాల ద్వారా పార్థివ దేహాలను తరలిస్తున్నాం. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే సంస్థ ప్రధాన లక్ష్యం. ఇంకా మరిన్ని సేవలు అందించడానికి ప్రణాళికలు తయారు చేసుకుంటున్నాం. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం.

– బలుసు సత్యనారాయణ, రాష్ట్ర కన్వీనర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వేళ్లచింతలగూడెంలో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ నాయక్, చైర్మన్ ఘంటా మధుకృష్ణ, నాయకులు


పశ్చిమ గోదావరి జిల్లా శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ జట్లు తలపడుతున్న దృశ్యం

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడలపై ఆసక్తి చూపాలని దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్ అన్నారు. వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఘంటా రంగావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా, శ్రీకాకుళం జిల్లా మధ్య పోటీలను సీఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులతో మారుమూల గ్రామంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈనెల 15వ తేదీ వరకూ జరిగే క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.1.50లక్షలు, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు ప్రకటించారు. వాలీబాల్ పోటీలు ఈనెల 9వ తేదీ వరకూ జరుగుతాయని, అందులో 8 నేషనల్ వైడ్ మహిళల టీంలు, 8 పురుషుల టీంలు పాల్గొంటాయన్నారు. వీరిలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు, తృతీయ బహుమతి రూ.30వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు ఆర్అండ్ఎం ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధుకృష్ణ బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, వెలగా శ్రీరామమూర్తి, మద్దిపాటి రమేష్‌చౌదరి, క్రికెట్ నిర్వాహకుడు కొర్లపాటి రాజా పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందివ్వాలి


హాజరైన ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

నిడదవోలు: పశ్చిమ డెల్టాలో దాళ్వాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కునాదరాజు మురళీకృష్ణంరాజు అన్నారు. పట్టణ శివారులో ఉన్న జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ప్రాజెక్టు కమిటీ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కునాదరాజు మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటి సంఘాల అధ్యక్షులు రైతు సమస్యలపై అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పశ్చిమ డెల్టా పరిధిలోని 131 నీటి వినియోగదారుల సంఘాలు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు హాజరయ్యారు. కార్యక్రమంలో పశ్చిమడెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగార్జునరావు, డ్రైనేజీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, నీటి పారుదల, మురుగు కాలువల ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. పిడింగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆవరణలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వార్షిక పరీక్షల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతితో పాటు మిగిలిన తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణ, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పునాది గట్టిగా ఉంటేనే ఎన్ని అంతస్తుల భవన నిర్మాణాన్ని అయినా చేపట్టడం సాధ్యం అవుతుందన్నారు. అదే విధంగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలో బోధన పద్ధతులు భవిష్యత్తుకు పునాది అన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి శిక్షణ ప్రణాళిక, సామగ్రి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపవిద్యాశాఖాధికారులు పాత్ర కీలకమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో రెగ్యులర్, ప్రైవేటుగా 25,723 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. గత ఏడాది 29,990 మంది విద్యార్థులు హాజరు కాగా 83.20 శాతం ఉత్తీర్ణత సాధించారని, సప్లిమెంటరీ పరీక్షల్లో 77.57 శాతంగా ఉందన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో అది 92.24, 97.28 శాతంగా ఉందని తెలిపారు. 2024–25 లో నూటికి నూరుశాతం సాధించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు లాకౌట్ ఎత్తివేత

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆంధ్రా పేపర్ మిల్లు మంగళవారం నుంచి లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆదివారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన విషయం తెలిసిందే. వేతన సవరణ విషయంలో కార్మికులు, యాజమాన్యానికి మధ్య ఐదు మాసాలుగా తర్జన భర్జనలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. మళ్లీ యాజమాన్యం మంగళవారం ఉదయం నుంచి లాకౌట్ ఎత్తివేయడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి


ఐసీడీఎస్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం: కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషణ, విద్య వారి శ్రేయస్సుపై బాలికల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ కె.అజయ్‌బాబు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం కిశోర బాలికల వికాసంపై సీడీపీవో కె.నాగలక్ష్మి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ అజయ్‌బాబు మాట్లాడుతూ కౌమారదశలో ఉన్న కిశోర బాలికలకు అవసరమైన ఆరోగ్యం, పరిశుభ్రత, రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే కిశోర వికాసం పథకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీడీపీవో నాగలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలకు వారి హక్కులు, శ్రేయస్సు, కమ్యూనిటీ ప్రమేయాన్ని బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ పోలీసులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.శ్రీనివాస్, ఎంఈవో జి.శ్రీనివాస్, అంగన్‌వాడీ ఏసీడీపీఓ యూవీ పద్మావతి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై డీటీఎఫ్ ఆందోళన


చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరహరి తదితరులు

నల్లజర్ల: విద్యారంగంపై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని నిరసిస్తూ డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు టీడీపీఎఫ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.నరహరి తెలిపారు. ఈ ఆందోళనకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం నల్లజర్లలో నరహరి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో పాఠశాల స్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన హామీలు మరచిపోవడం కంటే ద్రోహం ఉండదన్నారు. 16 డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె. త్రినాథరావు, జిల్లా అధ్యక్షులు పి.శేషబ్రహ్మం, కార్యదర్శి అప్పలాచారి, టి.రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, చిట్టిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖలో గృహ నిర్మాణాలకు ఇసుక తరలింపు


కుమారదేవం ర్యాంపులో అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఎస్.చిన్నరాముడు

కొవ్వూరు: విశాఖపట్నం జిల్లా గృహ నిర్మాణాలకు కుమారదేవం ర్యాంపు నుంచి ఇసుక సరఫరా చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో ఇసుక సరఫరా విధానాన్ని పరిశీలించేందుకు ర్యాంపులను పరిశీలించారు. ఇసుక రవాణా వ్యవస్థ మరింత మెరుగ్గా నిర్వహించాలని ర్యాంపు నిర్వాహకులకు సూచించారు. త్వరలో జిల్లాలో మరో 16 ఓపెన్ రీచ్‌ల ద్వారా 77లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. జేసీ వెంట మైన్స్ అండ్ జియోలాజికల్ ఆఫీసర్ డి.ఫణిభూషణ్‌రెడ్డి, కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

సంఘ లావాదేవీలు సభ్యులకు తెలియాలి

పెరవలి: డ్వాక్రా సంఘాల్లో జరిగే లావాదేవీలు సంఘ సభ్యులకు తెలియాలని ఏపీఎం రామకృష్ణ తెలిపారు. పెరవలి వెలుగు కార్యాలయంలో మంగళవారం మండలంలోని డ్వాక్రా సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1877 సంఘాలు ఉన్నాయని వీటిలో బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పటి వరకు 997 సంఘాలు తీసుకున్నాయని తెలిపారు. తణుకుకు చెందిన మహిళా వైద్యురాలు మండవ తేజస్విని మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే సమస్యల గురించి వివరించి అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు జన్ని మాధవి, సెక్రటరీ అనుకుల గంగారత్నం, కోశాధికారి ఊబా రామలక్ష్మి, ఉపాధ్యక్షురాలు మరిశెట్టి రేణుక, వివిధ గ్రామాల ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెరవలి: సంక్రాంతి ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఇందుకోసం ముందస్తుగానే ఆదేశాలు ఇవ్వటం జరిగిందని తహసీల్దార్ డి అచ్యుత కుమారి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోలీసులు, పంచాయతీ, రెవెన్యూ, గ్రామ సంరక్షణ సెక్రటరీలతో మంగళవారం సాయంత్రం సమావేశం జరిగింది. గ్రామాల్లో కోడి పందాలు, పేకాట, కోతాట, గుండాట వంటివి చట్టరీత్యా నేరమని అటువంటివి జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్సై ప్రసాదరావు మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

నేడు కిశోరి వికాసంపై శిక్షణ

ఉండ్రాజవరం: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోరి వికాసం పేరిట ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రామారావు మంగళవారం తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక పాఠశాల ఉపాధ్యాయుడు, ఒక ఏఎన్ఎం, మహిళా సంఘం అధ్యక్షురాలు, మహిళా సంరక్షణ కార్యదర్శి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పెరవలి ప్రాజెక్ట్ అధికారి, ఎంఈవో, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు ఆయా సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌కు సాదర స్వాగతం


పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథన్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా కొవ్వూరు విచ్చేసిన పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్‌కు ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం రాత్రి సాదర స్వాగతం పలికారు. స్థానిక అవంతీ ఫీడ్స్‌గెస్ట్ హౌస్‌కి చేరుకున్న ఆయనకు ఆర్డీవో పుష్పగుచ్ఛం అందజేశారు. బుధవారం ఉదయం ఇక్కడి నుంచి బయల్దేరి ఆయన యానం వెళ్లనున్నట్లు ఆర్డీవో తెలిపారు. అవంతీ ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు


నల్లజర్లలో యూరియా నిల్వలు చూపుతున్న ఏఓ కమల్‌రాజ్

నల్లజర్ల: వరి, మొక్కజొన్న పంటలకు సరిపడే యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందనవసరం లేదని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ స్పష్టం చేశారు. సూచించిన మేరకే యూరియా వినియోగించాలన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఇందువల్ల సమగ్ర పోషకాలు మొక్కకు అందకపోవడంతో దిగుబడి తగ్గుతుందని, పురుగులు, తెగుళ్లు సమస్య ఎక్కువగా ఉంటాయన్నారు. రెండో దఫా, మూడో దఫా వేయాల్సిన యూరియాను ఇప్పుడే కొని స్టాకు పెట్టుకునే అవసరం లేదన్నారు. దూబచర్ల మన గ్రోమోర్ సెంటర్, నలలజర్ల సొసైటీ, డీసీఎంఎస్ సెంటర్లు, ప్రైవేటు షాపులలో 272 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు.

పాతూరులో హనుమాన్ చాలీసా పారాయణ


కొవ్వూరులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

కొవ్వూరు: పట్టణంలో ధనుర్మాసం సందర్భంగా పాతూరు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. స్థానిక మహిళలు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గెయిల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రేమ్‌కుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (గెయిల్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మాతంగి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఎం.మాధురి ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈవోగా బదిలీ అయ్యారు.